క్లుప్తంగా

యువత గంజాయికి దూరంగా ఉండాలి

ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్



స్నిఫర్ డాగ్‌తో తనిఖీలు నిర్వహిస్తున్న సిబ్బంది

సిద్దిపేటకమాన్: యువత గంజాయి, ఇతర మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సిద్దిపేట ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ ఏ.శ్రీనివాస్ తెలిపారు. జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి శ్రీనివాసమూర్తి ఆదేశానుసారం గంజాయి, ఇతర మత్తు పదార్థాలపై సిద్దిపేట ప్రభుత్వ మెడికల్ కళాశాల చుట్టుపక్కల, ఆర్టీసీ బస్టాండ్‌లు, హోటల్స్, ఇతర ప్రాంతాల్లో ఎక్సైజ్ అధికారులు, సిబ్బంది మంగళవారం స్నిఫర్ డాగ్‌తో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గంజాయి వినియోగంపై స్నిఫర్ డాగ్ మెస్సీ చేత పలు ప్రాంతాలలో తనిఖీలు నిర్వహించామన్నారు. యువత గంజాయికి దూరంగా ఉండాలని, దానివల్ల కలిగే దుష్పరిణామాలు, ఈ కేసులలో పట్టుబడితే జీవితాలు ఎలా చిన్నాభిన్నం అవుతాయో తెలిపామన్నారు. తనిఖీలలో ఎక్సైజ్ ఎస్ఐ కిరణ్, హెడ్ కానిస్టేబుల్ రవీందర్, కానిస్టేబుళ్లు రవిగౌడ్, బాలమణి, మౌనిక, జ్యోతి, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

బీసీఏ గ్రూపులోకి మార్చండి

డెడికేటెడ్ కమిషన్ చైర్మన్‌కు వినతి



బీసీ డెడికేటెడ్ కమిషన్ చైర్మన్‌కు వినతిపత్రం అందిస్తున్న ప్రభాకర్‌వర్మ

సిద్దిపేటజోన్: పెరికలను బీసీ–బీ గ్రూప్ నుంచి బీసీ–ఏ గ్రూప్‌లోకి మార్చాలని రాష్ట్ర పెరికె కులసంఘం అధ్యక్షుడు లక్కరసు ప్రభాకర్ వర్మ అన్నారు. సమగ్ర కులగణన జరపాలని, జనాభా ప్రాతిపదికన బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలని కోరారు. మంగళవారం మాసబ్ ట్యాంక్ బీసీ సంక్షేమ భవన్‌లో బీసీ డెడికేటెడ్ కమిషన్ చైర్మన్ వెంకటేశ్వరరావును కలిసి ఆయన వినతిపత్రం అందించారు. కుల కార్పొరేషన్‌కు రూ.500 కోట్లు కేటాయించాలని తదితర అంశాలపై వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో నాయకులు సుధాకర్, బాల ప్రసాద్, పరమేశ్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా సంఘాలకు బీమా సౌకర్యం

డీఆర్‌డీఓ జయదేవ్‌ఆర్య

నంగునూరు (సిద్దిపేట): మహిళా సంఘాల ద్వారా రుణాలు తీసుకున్న మహిళలకు రాష్ట్ర ప్రభుత్వం బీమా సౌకర్యం కల్పించిందని డీఆర్‌డీఓ జయదేవ్‌ఆర్య అన్నారు. మంగళవారం మున్నాయిలోని వడ్ల కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేశారు. అనంతరం గ్రామైక్య సంఘంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామైక్య సంఘాల్లో నిర్వహించే లావాదేవీలు, సభ్యుల వివరాలను పారదర్శకంగా సేకరించాలన్నారు. డ్వాక్రా గ్రూపు సభ్యులు ఆర్థికంగా ఎదిగేందుకు బ్యాంకుల ద్వారా తక్కువ వడ్డీకి రుణాలు అందజేస్తున్నామని చెప్పారు. బీమా ఉన్న మహిళ మరణిస్తే రూ. 2 లక్షల బీమా వర్తించడంతో పాటు ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.10 లక్షలను అందజేస్తారన్నారు. కార్యక్రమంలో ఏపీఎం మహిపాల్, సీసీ బాలకిషన్ పాల్గొన్నారు.

దళారులను నమ్మి మోసపోవద్దు



అలిరాజ్‌పేటలో సీసీఐ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఏఎంసీ చైర్మన్ నరేందర్‌రెడ్డి

జగదేవ్‌పూర్(గజ్వేల్): దళారులను నమ్మి మోసపోవద్దని ఏఎంసీ చైర్మన్ నరేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని అలిరాజ్‌పేటలో విశ్వతేజ పత్తి మిల్లులో సీసీఐ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రైతులు పండించిన పత్తిని దళారులకు అమ్మి నష్టపోవద్దని సూచించారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన సీసీఐ కేంద్రాల్లో పత్తిని విక్రయించి మద్దతు ధర పొందాలన్నారు. గజ్వేల్ నియోజకవర్గంలో ఆరు సీసీఐ కేంద్రాలను ప్రారంభించినట్లు తెలిపారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ సర్దార్‌ఖాన్, ఏఓ వసంతరావు, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, నాయకులు మల్లేశం, కరుణాకర్, రాము, రమేష్, మహేందర్‌రెడ్డి, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభకు పదును.. సాంకేతిక దన్ను

కేజీబీవీలో డిజిటల్ బోధన

మారుతున్న కాలానుగుణంగా విద్యలో మార్పునకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. డిజిటల్ బోధన ప్రవేశపెట్టి.. మెరుగైన విద్యా ప్రమాణాలుతోపాటు సత్ఫలితాలను సాధించవచ్చని భావిస్తోంది. అందులో భాగంగానే దుబ్బాక కేజీబీవీలో డిజిటల్ బోధన నిర్వహిస్తున్నారు.

దుబ్బాకటౌన్: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు నాణ్యమైన బోధన అందించేందుకు ప్రభుత్వం డిజిటల్ బోధనకు శ్రీకారం చుట్టింది. ప్రభుత్వ, గురుకుల పాఠశాలలు, కేజీబీవీల్లో సాంకేతిక పరిజ్ఞానంతో పాఠాలు చెప్పేందుకు భారీ స్క్రీన్ లాంటి టీవీలను ఏర్పాటు చేసింది. దుబ్బాక పట్టణంలో కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో ఈ విద్యా సంవత్సరం నుంచి డిజిటల్ బోధనను ఉపాధ్యాయులు అందుబాటులోకి తీసుకువచ్చారు. ప్రస్తుతం 8, 9, 10వ తరగతి విద్యార్థినులకు డిజిటల్ బోధన చేస్తున్నారు.

చిత్ర పటాలను చూపిస్తూ..

జీవ శాస్త్రానికి సంబంధించిన పాఠాలు చెప్పే క్రమంలో కొన్ని రకాల చిత్ర పటాలను చూపిస్తూ బోధిస్తున్నారు. మానవ జీర్ణక్రియ, గణితానికి సంబంధించి త్రికోణమితి సూత్రాలు, భౌతిక, రసాయన శాస్త్రాల ఫార్ములాలు, సాంఘిక శాస్త్రం దేశ, ప్రపంచ పటాలను తెరపై చూపిస్తూ బోధిస్తుండటంతో విద్యార్థినులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. అలాగే తెలుగు పద్యాలు, ఇంగ్లిష్ సబ్జెక్ట్‌లో గల వివిధ కథలు చూస్తూ విద్యార్థినులు పూర్తిస్థాయిలో సులభంగా పాఠాలను అర్థం చేసుకుంటున్నారు.



కేజీబీవీలో డిజిటల్ బోధన చేస్తున్న ఉపాధ్యాయురాలు

సులువుగా అర్థమవుతోంది



డిజిటల్ తెరపై చెప్పిన పాఠాలు బాగా అర్థం అవుతున్నాయి. లేని పక్షంలో ఉపాధ్యాయుల సహాయంతో మరలా వీక్షిస్తున్నాం. అప్పుడే పూర్తి స్థాయిలో అవగాహన కలుగుతోంది. ఈ విధానం చాలా ఉపయోగకరంగా ఉంది. జీవ, భౌతిక శాస్త్రాలకు సంబంధించిన పటాలను క్షుణంగా చూస్తూ, వింటూ.. సులువుగా అర్థం చేసుకుంటున్నాం.

\- అక్షయ, 10వ తరగతి, కేజీబీవీ, దుబ్బాక

పూర్తిస్థాయిలో అవగాహన కల్పిస్తున్నాం



డిజిటల్ బోధనపై విద్యార్థినులు ఆసక్తి చూపుతున్నారు. అర్థం కాని అంశాలను తరగతులు పూర్తయిన తరువాత సాయంత్రం స్టడీ అవర్ లేదా నైట్ స్టడీ అవర్లో టెలివిజన్ ద్వారా మరోసారి చూపించి పూర్తి స్థాయిలో అవగాహన కల్పిస్తున్నాం. గణితంలో త్రికోణమితి, జాతీయ పటాలు, జీవ శాస్త్రంలో జీర్ణ వ్యవస్థ, గుండె, మూత్ర పిండాలు వంటి తదితర పటాలను టెలివిజన్ ద్వారా చూపించి, వినిపించడంతో విద్యార్థినులు పూర్తిగా తెలుసుకుంటున్నారు.

\-స్వాతి, ప్రిన్సిపాల్, కేజీబీవీ, దుబ్బాక

భూములిచ్చేందుకు రైతులు ముందుకు రావాలి

భూసేకరణ సభలో ఆర్డీఓ రాంమూర్తి



మాట్లాడుతున్న రాంమూర్తి

హుస్నాబాద్‌రూరల్: కెనాల్ కాల్వలు తవ్వితేనే గౌరవెల్లి ప్రాజెక్టు నీరు పంట పొలాలకు వస్తాయని రైతులు అందరూ ఆలోచించి భూములు ఇచ్చేందుకు ముందుకు రావాలని ఆర్డీఓ రాంమూర్తి అన్నారు. మంగళవారం తోటపల్లి రెవెన్యూ పరిధిలోని గాంధీనగర్ గ్రామంలో ఆర్డీఓ రాంమూర్తి ఆధ్వర్యంలో పోతారం(ఎస్), తోటపల్లి గ్రామాల్లో భూ సేకరణ గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గౌరవెల్లి ప్రాజెక్టు నీరు ఇవ్వడానికి కెనాల్ కాల్వలు తవ్వుతున్నామన్నారు. ఇప్పటికే రెవెన్యూ అధికారులు, ఇరిగేషన్ ఆధ్వర్యంలో భూముల సర్వే చేసినట్లు తెలిపారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం పరిహారం ఇస్తుందన్నారు. రైతుల అంగీకారం మేరకు కాల్వలకు సేకరించిన భూమికి హద్దులు ఏర్పాటు చేస్తామని చెప్పారు. అనంతరం పరిహారం ప్రభుత్వం అందిస్తున్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వేణుగోపాల్ రెడ్డి, మండల వ్యవసాయ అధికారి నాగరాజు, సర్వేయర్ లక్ష్మీనారాయణ, ఇరిగేషన్ డీఈ కరుణశ్రీ పాల్గొన్నారు.

పకడ్బందీగా ఇంటింటి కుటుంబ సర్వే

గజ్వేల్ ఆర్డీఓ చంద్రకళ



సర్వేను పరిశీలిస్తున్న ఆర్డీఓ చంద్రకళ

మర్కూక్(గజ్వేల్): పకడ్బందీగా గ్రామాలలో సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే నిర్వహించాలని గజ్వేల్ ఆర్డీఓ చంద్రకళ సూచించారు. మండలంలోని గంగాపూర్‌లో నిర్వహించిన ఇంటింటి కుటుంబ సర్వేను మంగళవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సమగ్ర కుటుంబ సర్వేను అధికారులు వేగవంతం చేయాలన్నారు. గ్రామాలలో సర్వేకు వచ్చిన అధికారులకు ప్రజలు సహకరించాలని కోరారు. అనంతరం పాములపర్తిలో సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వడ్ల కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేశారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా వడ్లు కొనుగోలు చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఆరీఫా, ఎంపీడీఓ అఫ్జలొద్దీన్, ఆర్గైలు శ్రీధర్, యాదగిరి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాణి, ఏఈఓ రజినీకాంత్, సమగ్ర కుటుంబ సర్వే అధికారులు పాల్గొన్నారు.

ఆలయ భూములను రక్షించండి



ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు, కార్యకర్తలు

కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లి మల్లికార్జున స్వామి భూములను కబ్జాదారుల నుంచి రక్షించాలని, ఆలయంలో జరుగుతున్న అవినీతిని అరికట్టాలని బీజేపీ మండల అధ్యక్షుడు బూర్గోజు నాగరాజు అన్నారు. మంగళవారం ఆలయంలో అవినీతిని అరికట్టాలని, ఆలయ భూములు రక్షించాలని మండల కేంద్రంలో కార్యకర్తలతో కలిసి ఆయన ర్యాలీ, ధర్నా చేశారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ఆలయ భూములను కొంతమంది ఆక్రమించి కిరాయి వసూలు చేస్తున్నారని ఆరోపించారు. ఆలయ అధికారులు ప్రలోభాలకు లోనై గుడి భూమిని అన్యాక్రాంతం చేస్తున్నారని మండిపడ్డారు. ఆలయంలో జరుగుతున్న అభివృద్ధి పనులలో ఆలయ ఉన్నత అధికారులు అవినీతికి పాల్పడటంతో నాణ్యతా లోపంతో కాంట్రాక్టర్లు నిర్మాణాలు చేపడుతున్నారని అన్నారు. కార్యక్రమంలో లక్ష్మారెడ్డి, మహేందర్‌రెడ్డి, మల్లేశం, భిక్షపతిరెడ్డి, కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

సమన్వయంతోనే లక్ష్యాలను చేరుకోవాలి

మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్ కుమార్

సిద్దిపేటజోన్: ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను అధిగమించేందుకు సమష్టిగా పనిచేయాలని మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్ కుమార్ సూచించారు. మంగళవారం తన కార్యాలయంలో వివిధ విభాగాల అధికారులతో కలిసి ఆయన సమీక్ష నిర్వహించారు. పారిశుద్ధ్య నిర్వహణకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఇంటింటికీ చెత్త సేకరణ వాహనం తప్పనిసరి వెళ్లాలన్నారు. పారిశుద్ధ్య సమస్యలు సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు. పట్టణంలో బ్లాక్ స్పాట్స్ ఉండకూడదని సూచించారు. సేంద్రియ ఎరువుల తయారీ ప్రక్రియ వేగవంతం చేయాలని సూచించారు. సేంద్రియ ఎరువులు విక్రయించడానికి అవసరమైన ఏర్పాట్లు చేయాలని సూచించారు. పట్టణంలో మిగిలిన పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఇంజినీరింగ్ అధికారులకు సూచించారు. మంచి నీరు సరఫరాలో ఎలాంటి ఆటంకాలు లేకుండా చూడాలని ఆదేశించారు. కొత్తగా ఇంటి నిర్మాణం అనుమతుల మేరకు జరిగేలా చూడాలని సూచించారు. నిబంధనలు అతిక్రమించిన వాటిపై చర్యలు తీసుకోవాలన్నారు. ఫుట్‌పాత్‌లను ఆక్రమిస్తే మున్సిపల్ చట్టం మేరకు చర్యలు తీసుకోవాలని సూచించారు. పట్టణంలో ఇంటి, నీటి పన్నులను వసూలు చేయాలని సూచించారు. సమావేశంలో మున్సిపల్ మేనేజర్ శ్రీనివాస్ రెడ్డి, డీఈ ప్రేరణ, టౌన్ ప్లానింగ్ అధికారులు నర్శిన్ భాను, దేవరాజ్, స్రవంతి, శానిటరీ ఇన్‌స్పెక్టర్‌లు సతీశ్, వనిత, మాధవి, రెవెన్యూ అధికారి శ్రీకాంత్ పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రి తనిఖీ



నిర్మాణంలో ఉన్న మున్సిపల్ భవనాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ మనుచౌదరి

హుస్నాబాద్: హుస్నాబాద్ ప్రభుత్వ ఆస్పత్రిని మంగళవారం కలెక్టర్ మనుచౌదరి ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. రోగులకు అందించే సేవలు, ఓపీ గురించి డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. ఫార్మసీలో కాలం చెల్లిన మందులు వాడకూడదన్నారు. డయాలసిస్ సెంటర్‌లో రోగులకు అత్యంత జాగ్రత్తగా వైద్యసేవలు అందజేయాలని, చిన్న పొరపాటు జరిగిన ప్రాణాలకే అపాయమన్నారు. కొత్తగా నిర్మిస్తున్న అసిస్టెంట్ పోలీస్ కార్యాలయం, మున్సిపల్ భవనం, గ్రంథాలయ నిర్మాణాలను పరిశీలించారు. చిన్న చిన్న పనులు పూర్తి చేసి ప్రారంభానికి సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్డీఓ రామ్మూర్తి, ఏసీపీ సతీశ్, మున్సిపల్ చైర్ పర్సన్ ఆకుల రజిత, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి, మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్, కౌన్సిలర్ దొడ్డి శ్రీనివాస్, నళినిదేవి తదితరులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం స్వాధీనం



నిందితుడిని విలేకరులకు చూపుతున్న ఎస్ఐలు కనకయ్యగౌడ్, సాయిప్రసాద్

సిద్దిపేటకమాన్: ఒక ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వన్‌టౌన్ సీఐ వాసుదేవరావు తెలిపిన వివరాల ప్రకారం.. సాయిబాబా ఆలయ సమీపాన ఉన్న మణెమ్మ ఇంట్లో కోహెడ మండలం గుండారెడ్డిపల్లికి చెందిన రాజిరెడ్డి రేషన్ బియ్యాన్ని నిల్వ ఉంచాడనే పోలీసులకు సమాచారం వచ్చింది. దీంతో టాస్క్‌ఫోర్స్ ఎస్ఐ సాయిప్రసాద్, వన్ టౌన్ ఎస్ఐ కనకయ్యగౌడ్‌తో కలిసి సిబ్బంది వెళ్లి దాడులు చేశారు. దీంతో 9 కింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. కేసు దర్యాప్తులో ఉంది.

అవకతవకలపై విచారణకు ఆదేశం

- జిల్లాస్థాయి అధికారిని నియమించిన కలెక్టర్ మనుచౌదరి
- లబ్ధిదారులతో చెలగాటం, పంపకాల్లో పేచీ కథనాలపై స్పందన

సాక్షి ఎఫెక్ట్..

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ఎస్సీ కార్పొరేషన్‌లో జరుగుతున్న అవకతవకలపై ఎస్సీ కార్పొరేషన్ ఎండీ క్షితిజ విచారణకు ఆదేశించారు. దీంతో కలెక్టర్ ఒక విచారణ అధికారిని నియమించారు. ఈ విషయమై ఈ నెల 6, 7వ తేదీల్లో ''లబ్ధిదారులతో చెలగాటం'', ''పంపకాల్లో పేచీ'' వరుస కథనాలను సాక్షి దినపత్రిక ప్రచురించింది. తాజా చర్య వల్ల కుల సంఘాల నాయకులతో, ఉద్యోగ సంఘాల నాయకులతో కలిసి అవకతవకలకు పాల్పడ్డ అధికారులు రహస్యంగా మంతనాలు జరుపుతున్నట్లు విశ్వసనీయ సమాచారం. తమ పేరు బయటకు రాకుండా జాగ్రత్తలు పడుతున్నట్లు తెలిసింది.

సబ్సిడీ స్వాహాపై చర్యలు

మార్చి 3న ''సబ్సిడీ స్వాహా'' సాక్షిలో ప్రచురితమైన కథనానికి స్పందించిన రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ అధికారులు గతంలో విచారణకు ఆదేశించగా, విచారణ రిపోర్టు ఎస్సీ కార్పొరేషన్ ఎండీకి చేరినట్లు సమాచారం. త్వరలోనే సబ్సిడీలో అవకతవకలకు పాల్పడిన అధికారుల పై చర్యలు తీసుకోనున్నట్లు తెలిసింది. దీంతో తమ పేరు ఎక్కడ బయటకు వస్తుందో అని ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు.

టిప్పర్‌పై కేసు నమోదు



పోలీసులు పట్టుకున్న టిప్పర్

కోహెడరూరల్(హుస్నాబాద్): అక్రమంగా మట్టిని తరలిస్తున్న టిప్పర్‌ను రెవెన్యూ అధికారులు, పోలీసులు పట్టుకున్నారు. మండలంలోని ధర్మసాగర్‌పల్లి పరిధిలో ఉన్న జుమ్లా నాయక్ తండా గుట్ట నుంచి అక్రమంగా మట్టి తరలిస్తున్నారని మంగళవారం గుట్టను మాయం చేసింద్రు అనే కథనాన్ని సాక్షి దినపత్రిక ప్రచురించింది. స్పందించిన రెవెన్యూ అధికారులు, ఎస్ఐ అభిలాశ్ గుట్ట నుంచి మట్టిని తరలించిన టిప్పర్‌ను పట్టుకున్నారు. అప్పటికే ధ్వంసమైన గుట్ట పరిశీలించి అందుకు కారణమైన వారిపై చర్యలు తీసుకుంటామని ఆర్ఐ సురేందర్ తెలిపారు.

ఆరోగ్యాన్ని కాపాడుకోవాల్సిందే..

అడిషనల్ డీసీపీ మల్లారెడ్డి



మల్లారెడ్డికి బీపీని పరీక్షిస్తున్న వైద్యుడు

సిద్దిపేటకమాన్: ఆరోగ్యమే మహాభాగ్యయని సమయం కేటాయించుకుని హెల్త్‌ను పరిరక్షించుకోవాలని అడిషనల్ డీసీపీ మల్లారెడ్డి అన్నారు. పోలీసు అధికారులు, సిబ్బందికి రక్త పరీక్షల నిర్వహణ అనంతరం వచ్చిన రిపోర్టుల ఆధారంగా ప్రభుత్వాస్పత్రిలో వైద్యులు మంగళవారం కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా అడిషనల్ డీసీపీ మాట్లాడారు. 15 రోజులుగా పోలీసు సిబ్బందికి 54 రకాల వైద్య పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. మొదటి విడతలో 50 మంది అధికారులకు, సిబ్బందికి కౌన్సెలింగ్ నిర్వహించారని, అవసరమైన వారికి మందులు అందజేశారని తెలిపారు. విధి నిర్వహణ ఎంత ముఖ్యమో, ఆరోగ్య పరిరక్షణ కూడా అంతే ముఖ్యమన్నారు. సిబ్బంది ఒత్తిడి లేకుండా చూసుకోవాలన్నారు. వ్యాయామం, యోగా లాంటివి రోజూ అలవాటు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మెడికల్ కళాశాల డైరెక్టర్ డాక్టర్ విమలాథామస్, సూపరింటెండెంట్ డాక్టర్ శాంతి, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ చందర్, ఆర్ఎంఓలు జ్యోతి, కాంతశ్రీ, గీత, పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వికారాబాద్ ఘటనపై వెల్లువెత్తిన నిరసనలు

వికారాబాద్ జిల్లాలో కలెక్టర్‌తో పాటుగా అధికారులపై జరిగిన దాడిని రెవెన్యూ సిబ్బంది, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సంఘం నేతలు తీవ్రంగా ఖండించారు. మంగళవారం నల్లబ్యాడ్జీలను ధరించి నిరసన తెలిపారు. సిద్దిపేటలో అదనపు కలెక్టర్‌కు, జిల్లాలోని రెవెన్యూ అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. కార్యక్రమాల్లో ఆర్ఐలు, ఔట్ సోర్సింగ్ సంఘం నేతలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

\- నెట్‌వర్క్



సిద్దిపేటరూరల్: అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు



చేర్యాల: నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన చేస్తూ..



కోహెడ: తహసీల్దార్ కార్యాలయం ఎదుట..

శాస్త్రీయ విద్యాసాధన కోసం పోరాటాలు

పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్



మాట్లాడుతున్న శ్రీకాంత్

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ప్రగతిశీల విద్యార్థి ఉద్యమంలో అసువులు బాసిన విద్యార్థి అమరులు చూపిన మార్గంలో ముందుకు సాగుతామని పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ పిలుపునిచ్చారు. విద్యార్థి అమరుల సంస్మరణ వారోత్సవాలలో భాగంగా మంగళవారం సిద్దిపేటలో సంస్మరణ సభను నిర్వహించారు. దీనికి ముఖ్యఅతిథిగా ఆయన హాజరై మాట్లాడారు. దోపిడీ పీడనలేని సమ సమాజం కోసం తపించి.. జార్జిరెడ్డి మొదలు జంపాల చంద్రశేఖర్ ప్రసాద్, శ్రీపాద శ్రీహరి, కోలాశంకర్, రంగవల్లి, స్నేహలత, మారోజు వీరన్న లాంటి అనేక మంది విప్లవ వీర కిశోరాలు తమ విలువైన ప్రాణాలను అర్పించారని గుర్తు చేశారు. పీడీఎస్‌యూ అనేక దశాబ్దంగా శాస్త్రీయ విద్యాసాధన కోసం పోరాటాలు నిర్వహిస్తుందన్నారు. విద్యార్థి ఉద్యమంలో ప్రాణాలు అర్పించిన అమరుల వారోత్సవాలను రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సంఘం జిల్లా కమిటీ సభ్యుడు గణేశ్, సంఘం నాయకులు యాదగిరి, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

దీపోత్సవం.. శోభాయమానం



సహస్ర దీపోత్సవంలో మహిళలు

కార్తీక దీపోత్సవాల నడుమ నాచగిరి విద్యుత్ కాంతులతో మెరిసిపోతోంది. రోజూ రాత్రి సహస్ర దీపోత్సవం కనులపండువగా జరుగుతోంది. మంగళవారం రాత్రి ఆలయ ఈఓ అన్నపూర్ణ పర్యవేక్షణలో దీపోత్సవ ఏర్పాట్లు చేశారు. పెద్దసంఖ్యలో మహిళలు ఆలయ ముఖమండపంలో జ్యోతులు వెలిగించారు. మహిళలకు ఈఓ పసుపు, కుంకుమాలు, వాయనాలు అందజేశారు.

వర్గల్(గజ్వేల్)

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
యం. నాగరాజు-9010957373
రమేష్ - 9951952990